వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం



తక్షణమే ఉపసంహరించుకోవాలని ముస్లింల ఆందోళన

● ఆమనగల్లులో భారీ ర్యాలీ

ఆమనగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆమనగల్లు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఆమనగల్లు పట్టణంలో ముస్లింలు కదంతొక్కారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనను చేపట్టారు. మజీద్‌లో నమాజ్ అనంతరం వందలాది మంది ముస్లింలు హైదరాబాద్- శ్రీశైలం జాతీయరహదారిపై జామీయ మజీద్ అధ్యక్షులు మహ్మద్ మాసూమ్ ఆధ్వర్యంలో ప్లకార్డులు, నల్లబ్యాడ్జీలు, బ్యానర్లు, జాతీయ జెండా చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వానికి, వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్యాంగం ముస్లింలకు ఇచ్చిన హక్కులను, మత స్వేచ్ఛను హరించడానికి కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చిందని మైనార్టీ నాయకులు ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకే బీజేపీ ప్రభుత్వం బిల్లును తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో మజీద్ అధ్యక్షులు మహ్మద్ మాసూమ్, ఎండీ గౌసొద్దీన్, ఖాదర్‌ఖాద్రీ, జానిబాయ్, సయ్యద్, సయ్యద్ మీర్, నాయకులు జహంగీర్, నయీమ్, జబ్బార్, రజాక్,అల్తాఫ్, ఎజాస్, ఖాదర్, షైమద్, జహంగీర్‌అలీ, జావెద్, అఫ్జల్, ముజీబుర్ రహెమాన్, అహ్మద్, జహంగీర్ బాబా, అక్రమ్,ఖుద్దూస్, జహంగీర్, సోహెల్, అన్వర్, బాబా, అలీమ్, అజ్జు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే

జిల్లావ్యాప్తంగా శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు చర్చిలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యువతులు ఏసు కీర్తనలు ఆలపించి అలరించారు. ఏసు ప్రభువు వేషధారణలో శిలువ ఎత్తుకొని ఊరేగింపు నిర్వహించారు. షాబాద్, మొయినాబాద్, కేశంపేట, చౌదరిగూడ మండలాల్లోని చర్చిలలో ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్లు, ఫాస్టర్లు గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు. ఏసుక్రీస్తును శిలువ వేసిన జ్ఞాపకార్థంగా గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటామని తెలిపారు.



కేశంపేట మండల పరిధిలోని పాటిగడ్డ చర్చిలో...





మొయినాబాద్ : మెథడిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



యాచారం : కొత్తపల్లిలో ఇంటిపై కూలిన చెట్టు

గాలివాన బీభత్సం

ఉమ్మడి జిల్లాలో ఉరుములు, మెరుపులతో వర్షం

వికారాబాద్‌లో చెట్టు విరిగిపడి ఇద్దరికి గాయాలు

దెబ్బతిన్న మామిడి, బొప్పాయి, అరటి, మొక్కజొన్న

యాచారంలో కూలిన పశువుల దొడ్లు

తాండూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఏప్రిల్ 18 : ఉమ్మడి జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. శుక్రవారం పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై భారీగా నీరు నిలిచి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. బలమైన గాలులు వీచడంతో చెట్లు విరిగిపడ్డాయి. పశువుల దొడ్లు కూలిపోయాయి. వరి పంట నేల వాలింది. వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వికారాబాద్ జిల్లా మర్పల్లి, కొత్లాపురం, సిరిపురం గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి దాదాపు 20 ఎకరాల్లో బొప్పాయి, 10 ఎకరాలకు అరటి తోటలు, 30 ఎకరాల్లో మొక్క జొన్న పంటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. మదనపల్లి సమీపంలో చెట్టు విరిగి రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వికారాబాద్ పట్టణం కొత్తగడి సమీపంలో వీచిన ఈదురు గాలులకు భారీ వృక్షం విరిగి ట్రాక్టర్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులపై పడింది. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే మెడిక్యూర్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు, వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్ ఆసుపత్రికి వెళ్లి బాధితులను

మిగతా 7వ పేజీలో...



మొయినాబాద్ : హిమాయత్ నగర్‌లో కురుస్తున్న వర్షం



ఆమనగల్లు పట్టణ ముఖచిత్రం

విభజనతోనే సరి

వసతులేవీ?

అందుబాటులో లేని ప్రభుత్వ కార్యాలయాలు

తొమ్మిదేళ్ల క్రితం పాలనా సౌలభ్యం కోసం చేపట్టిన జిల్లాల పునర్విభజన ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాల ప్రజలకు శాపంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో లేక నానా అవస్థలు పడుతున్నారు. విభజన అనంతరం ఈ మండలాలు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోకి వెళ్లాయి. దీంతో ఏ పని కోసం వెళ్లాలన్నా ప్రజలు వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోంది. అయితే నాలుగు మండలాలకు కలిపి ఆమనగల్లులో ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్లతరబడి ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఈ ప్రాంత ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాలనాపరమైన సమస్యలతో సతమతం

దూరభారంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

నేతల హామీలు ప్రతిపాదనలకే పరిమితం

ఉన్న కార్యాలయాలకు పక్కా భవనాలు కరువు

ఆమనగల్లు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): పాలనా సౌలభ్యం కోసం గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాలను మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లాలో విలీనం చేశారు. అయితే ఈ మండలాల్లో నేటికీ అందుకనుగుణంగా వసతులు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారు. ఏళ్ల కాలంగా ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో లేక, దూరభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆమనగల్లు పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, ఆర్టీఏ, ఆర్డీవో, ఏసీపీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఆర్‌అండ్‌బీ డీఈ, ఐబీ, డీఈ కార్యాలయాల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఆయా కార్యాలయాల ఏర్పాటు విషయంలో నేతలు ఇచ్చిన హామీలు నీటి మీది రాతల మాదిరిగా మారాయి.

స్పందించని ప్రభుత్వం

జిల్లాల పునర్విభజనలో భాగంగా 2016 అక్టోబర్ 11న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన

మిగతా 8వ పేజీలో...

ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతాం



ఆమనగల్లు పట్టణంలో డివిజన్ కార్యాలయాల ఏర్పాటు గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతాం. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డిల ద్వారా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి డివిజన్ కార్యాలయాల ఏర్పాటు ఆవశ్యకత గురించి వివరిస్తాం. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడం జరుగుతుంది. జిల్లాల పునర్విభజన , కొత్త మండలాలను ఏర్పాటు చేసిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అందుకనుగుణంగా కార్యాలయాల, వసతుల కల్పనలో విఫలమైంది.

యాట గీతానర్సింహ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, ఆమనగల్లు

ఉద్యాన పంటలపై అవగాహన



షాద్‌నగర్‌రూరల్: అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలపై కిషన్‌నగర్ రైతులకు ఉద్యాన విద్యార్థులు అవగాహన కల్పించారు. శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటలు, నేల రకం, వ్యవసాయంలో సాంకేతికత, నిల్వ, దిగుబడి పెంచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మామిడి, జామ, టమాటా, మిరప, వంకాయ తదితర పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

పంటమార్పిడిని అవలంబించాలి

చేవెళ్ల: రైతులు పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలని ఆచార్య కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు అన్నారు. చేవెళ్ల మున్సిపాల్ పరిధిలోని కందవాడలో పర్యటించారు. గ్రామంలో రైతులు సాగుచేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట మార్పిడితో వచ్చే లాభాలను రైతులకు వివరించారు. విద్యార్థులు స్వాతి, ప్రీతి, అఖిల, శారద, సంతోష, సానియా ఉన్నారు.



రజతోత్సవ సభకు భారీ జనసమీకరణ

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

7

మురుగు.. వాగులో పరుగు!

అపార్ట్‌మెంట్‌లో కనిపించని ఎస్టీపీలు

వాగుల్లోకి చేరుతున్న డ్రెయినేజీ నీరు

దుర్వాసనను భరించలేకపోతున్న జనం

విజృంభిస్తున్న దోమలు, ఈగలు

వ్యాధులతో స్థానికుల సహజీవనం

ఆదిభట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలలో ఆదిభట్ల ముందు వరుసలో నిలుస్తుంది. అయితే ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఇక్కడ నిర్మాణమైన అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే మురుగు పులిందరి వాగులో కలిసి కంపుకొడుతోంది. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆదిభట్ల, కొంగరకలాన్, ఎంపీపటేల్‌గూడ, సాహెబ్‌గూడ, బొంగ్లూర్, మంగల్‌పల్లి, రాందాస్‌పల్లిలో 15 వార్డులు, 73 కి.మీ. విస్తీర్ణం, 22 వేలకు పైగా జనాభా ఉంది. ప్రపంచ ఖ్యాతిగాంచిన కంపెనీలు, విద్యాసంస్థలు, కలెక్టరేట్ కూడా ఇక్కడే ఉన్నాయి దీంతో పాటు ఓఆర్ఆర్‌కు దగ్గరగా, హైదరాబాద్‌కు కూత వేటు దూరంలో ఉండటంతో

మిగతా 8వ పేజీలో...

కంపుకొడుతున్న పులిందరి వాగు



ఎంపీపటేల్‌గూడ కల్వర్టు వద్ద నిలిచిన మురుగు

దోమలతో తట్టుకోలేకపోతున్నాం



మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. అధికారులు, నాటి ప్రజాప్రతినిధులు హడావిడి చేసి కాలనీల నుంచి వెలువడే మురుగు నీరును వరద నీరు ప్రవహించే వాగులో కలిపారు. వాగులో మురుగు నిలిచి కంపు కొడుతోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాలబారిన పడుతున్నాం. వెంటనే సమస్య పరిష్కరించాలి.

శివకుమార్, ఎంపీ పటేల్‌గూడ నివాసి

గ్రాసం కరువు పోషణ బరువు!

» ట్రాక్టర్ ఎండు గడ్డి ధర రూ.95వేలు

యాచారం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో మూడేళ్లుగా ఆశించిన మేర వర్షాలు కురవడం లేదు. దీంతో చెరువులు, కుంటల్లో నీరు చేరక కనీసం పశుగ్రాసం కూడా దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో మూగజీవాలు మేత దొరకక అల్లాడిపోతున్నాయి. విధిలేక కొందరు రైతులు హాలియా, సాగర్ ప్రాంతాల నుంచి ఎండు గడ్డిని కొని తెచ్చుకుంటున్నారు. గడ్డి ధర కూడా విపరీతంగా ఉండటంతో బెంబేలెత్తుతున్నారు. ట్రాక్టర్ వరిగడ్డి రూ.95వేల వరకు పలుకుతోంది. ధర ఎక్కువైనా పశువులను కాపాడుకునేందుకు గడ్డిని కొని తెచ్చుకుంటున్నారు. ఇక గడ్డి కొనే స్థోమత లేని రైతులు పోషణ భారమై పశువులను కబేళాకు తరలిస్తున్నారు.

ఎయిర్‌పోర్టుకు గ్లోబల్ గుర్తింపు



జీఎంఆర్ అధికారులను సన్మానిస్తున్న ఏసీఏ అధికారులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరో అరుదైన గుర్తింపు దక్కిందని జీఎంఆర్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు ఈడీ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, ఏసీఐ ఆసియా పసిఫిక్ అండ్ మిడ్‌లిస్ట్ ప్రెసిడెంట్ ఎస్‌జీకే కిశోర్ మాట్లాడుతూ.. ఏసీఏ లెవల్-5 కార్బన్ అక్రిడిటేషన్‌తో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు గ్లోబల్ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఏసీఐ ఆసియా-పసిఫిక్ మిడ్‌లిస్ట్ ప్రాంతంలో టాప్ నాలుగు విమానాశ్రయాల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఒకటిగా గుర్తించారని చెప్పారు. నెట్ జీరో ఎమిషన్ల సాధనలో అత్యుత్తమ కృషివల్లే ఈ గౌరవం దక్కిందని వెల్లడించారు. విమానాశ్రయాలు తమ కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలను అంచనా వేయడానికి ఏసీఏ ప్రోగ్రామ్‌ను స్టాండర్డ్‌గా పరిగణిస్తారని పేర్కొన్నారు. ఇందులో ముఖ్యంగా మ్యాపింగ్ రిడక్షన్, ఆప్టిమైజేషన్, ట్రాన్స్‌ఫార్మేషన్, ట్రాన్సిషన్, అత్యుత్తమ ఈ లెవల్ 5 గుర్తింపు గెయిల్ విమానాశ్రయాన్ని ఏసీఐ ఆసియా పసిఫిక్ అండ్ మిడ్‌లిస్ట్ ప్రాంతంలో ఈ స్థాయిని పొందిన విమానాశ్రయాల్లో జీఎంఆర్ ఎయిర్‌పోర్టు నిలవడం సంతోషంగా ఉందన్నారు. స్కోప్ 1, స్కోప్ 2 కార్బన్ ఉద్గారాలను నెట్‌జీరో స్థాయిలో కొనసాగించడమే కాకుండా 2050, లేదా అంతకంటే ముందే స్కోప్ 3 ఉద్గారాలను నెట్ జీరోగా మార్చే దిశగా జీఎంఆర్ అడుగులు వేస్తోందని చెప్పారు. విమాన ప్రయాణికులకు ప్రపంచ స్థాయి మెరుగైన సౌకర్యాలు కల్పించడమే జీఎంఆర్ లక్ష్యమని చెప్పారు.

పార్టీ సభ్యత్వంపై శ్రేణులు దృష్టి పెట్టాలి : బక్కని

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులు దృష్టిపెట్టి భారీ సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించాలని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, పొలిట్‌బ్యూరో మెంబర్ బక్కని నర్సింహులు అన్నారు. మొయినాబాద్ పట్టణ పరిధి పెద్దమంగళారంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో టీడీపీకి పునర్వైభవం తెచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. సభ్యత్వ నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ పనిచేయాలని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు కేతన్‌రావు, ప్రధాన కార్యదర్శి రాఘవులు, పార్టీ మండల అధ్యక్షుడు ఎల్గని యాదయ్యగౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పెద్దమంగళారంలో సభ్యత్వ నమోదులో బక్కని నర్సింహులు

స్నేహితుడికి ఆర్థికసాయం అందజేత

యాచారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి శుక్రవారం రూ.83వేల ఆర్థికసాయం అందించారు. మండలంలోని చిన్నతూండ్లకు చెందిన జక్కుల రవీందర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గ్రామ యువకులు, స్నేహితులు, ఉద్యోగులు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో రావుల వెంకటేష్, శ్రీను, సుధాకర్, సుమన్‌రెడ్డి, వెంకటేష్ ఉన్నారు.

చెరువు కుంటల జోలికెళ్లం : ఆర్డీవో

యాచారం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ భూముల్లో ఉన్న చెరువులు, కుంటల జోలికి వెళ్లం అని, వాటిల్లోకి రైతులు ఇప్పటి లాగే వెళ్లేలా వీలు కల్పిస్తామని ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ ఆఫసర్(ఆర్డీవో) అనంతరెడ్డి తెలిపారు. ఫార్మా భూములకు ఫెన్సింగ్ వేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి రైతులు, మత్స్యకారులు ఎప్పటిలాగే వెళ్లి వారి పనులు చేసుకోవచ్చన్నారు. నీటి వనరుల వద్దకు రోడ్డు వేస్తామని చెప్పారు. చెరువు, కుంటలను ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు అప్పగిస్తుందనే మాటలు నమ్మొద్దని సూచించారు. నీటి వనరుల సంరక్షణ ప్రభుత్వానిదే బాధ్యత అని నొక్కి చెప్పారు. కొందరు తప్పుడు వార్తలను సృష్టించి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. చెరువు, కుంటలపై రైతులు, కులవృత్తుల వారు ఆధారపడతారన్నారు. కోర్టు కేసుల్లోని భూములను స్వాధీనం చేసుకోం అన్నారు.

దాహార్తి తీర్చేందుకు కృషి చేయాలి

ఘట్‌కేసర్,ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి):ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ బైపాస్ చౌరస్తాలో మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మజ్జిగను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. పార్టీ సభకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చేలా కృషిచేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు శ్రీనివాస్, సురేంద ర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


నాయకులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

రెడీమిక్స్ ప్లాంట్‌ను ప్రారంభించిన స్పీకర్

వికారాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని గోదాంగూడ రోడ్డులో గల సీఆర్ఆర్ రెడీమిక్స్ ప్లాంట్‌ను అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. శుక్రవారం ప్లాంట్ ప్రారంభోత్సవంలో భాగంగా పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకల్లో నిర్వాహకులు లక్ష్మీకాంత్‌రెడ్డి స్పీకర్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వికారాబాద్ పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రెడీ మిక్స్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఇంటివద్ద ఉపాధి అంటూ కుచ్చు టోపీ

● మహిళల వద్ద రూ.వెయ్యి చొప్పున వసూలు
● పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

మోమిన్‌పేట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఇంటి దగ్గరే ఉపాధి కల్పిస్తామని మహిళల దగ్గర లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఓ మహిళను మోమిన్‌పేట్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండలంలోని ఎన్కెపల్లికి చెందిన కిష్టయ్య, కేశమ్మ దంపతుల కూతురు పడాల సురేఖకు సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బిల్లలపుర గ్రామానికి చెందిన నాగరాజ్‌తో వివాహం చేసి ఇల్లరికం తెచ్చుకున్నారు. భర్త రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా సురేఖ ఇంటి దగ్గరే టైలరింగ్ పనిచేసుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఓ రోజు సెల్‌ఫోన్‌లో రీల్ చూస్తూ.. ఇంటి వద్దే ఉంటూ నెలకు పది వేలు సంపాదించే అవకాశం కల్పిస్తామనే వీడియో చూసింది. రీల్‌లో తెలిపిన చిరునామాలో సంప్రదించగా మహేందర్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తమ కంపెనీలో మహేందర్ అండ్ మహేందర్ చాక్లెట్లు తయారు చేస్తామని, వాటిని మీ ఇంటికి పంపిస్తామన్నాడు. వాటిని ప్యాక్ చేసి పంపితే నెలకు 15వేల వరకు ఇస్తామని తెలిపాడు. అలాగే మహిళలకు ఉపాధి కల్పించేందుకు కంపెనీలో ఉద్యోగాలున్నాయని సురేఖను నమ్మించాడు. దీంతో సురేఖ అతడి మాట ప్రకారం మోమిన్‌పేట్ మండలంలోని రాంనాథ్‌గూడపల్లి, మోమిన్‌పేట్, చంద్రాయన్‌పల్లి, వెల్చాల్, నవాబుపేట్, కోట్‌పల్లి మండలాల్లోని గ్రామాలు ఎల్లకొండ, బార్వాద్‌లో మహిళల దగ్గరికి వెళ్లి వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేసింది. డబ్బులిచ్చిన మహిళలు సురేఖకు ఫోన్ చేస్తుండగా మీకు త్వరలోనే కంపెనీ చాక్లెట్లు వస్తాయని చెప్పసాగింది. కొన్ని రోజులనుంచి మహిళలు సురేఖకు ఫోన్ చేయగా సరైన సమాధానం చెప్పలేదు. ఫోన్ స్విచాఫ్ చేసింది. దీంతో శుక్రవారం ఉదయం ఆయా గ్రామాల మహిళలు ఎన్కెపల్లిలోని సురేఖ ఇంటికి వెళ్లి నిలదీశారు. దీంతో భయంతో సురేఖ వెంటనే డయల్ 100కు సమాచారం ఇచ్చింది. పోలీసులు గ్రామానికి వెళ్లి జరిగిన విషయాన్ని తెలుసుకొని సురేఖను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. సమాచారం తెలుసుకున్న మిగతా గ్రామాల మహిళలు స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు జరిగిన విషయాన్ని వివరించారు. మహిళల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ దత్తాత్రేయ తెలిపారు.


పోలీసులకు వివరాలు వెల్లడిస్తున్న బాధిత మహిళలు

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలు



పరిగిలో జరిగిన భారీ నిరసన ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

పరిగి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు పరిగి మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నమాజ్ తర్వాత జామ మసీదు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి సీపీఎం, ఎల్‌హెచ్‌పీఎస్ మద్దతు పలికాయి. జిల్లా పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మీర్ మహమూద్ అలీ, నాయకులు మాట్లాడుతూ.. ముస్లింలకు వ్యతిరేకంగా బిల్లును తెచ్చారన్నారు. వక్ఫ్ అంటేనే ప్రార్థన స్థలమని, కేంద్రప్రభుత్వం ముస్లింల హక్కులకు చట్టాలు చేస్తోందన్నారు. వక్ఫ్ బిల్లుకు మద్దతిచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు, బిహార్ సీఎం నితీష్‌కుమార్‌లను ముస్లింలు క్షమించరన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు మోహిజ్, నాయకులు మీర్ తాహేర్ అలీ, సయ్యద్ అయూబ్, యూసుఫ్ అలీ, సమీపటేల్, అబ్దుల్ బషీర్, పాషసాబ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరులో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నిరసన తెలిపారు. మసీదుల్లో ప్రార్థనల అన ంతరం నిరసన తెలిపారు. ముస్లింల అణచివేతకే బిల్లు తెచ్చారని, దాన్ని వాపస్ తీసుకునే వరకు పోరాటం చేస్తామని అన్నారు.

మోమిన్‌పేట్/నవాబుపేట: వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. మోమిన్‌పేట్‌లోని జామా మస్జీద్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అన ంతరం ఆర్ఐ గోవర్ధన్‌కు వినతిపత్రం ఇచ్చారు. నవాబుపేట మండ లం ఏక్‌మామిడి, అక్నాపూర్, చిట్టిగిద్ద, చంచల్‌పేట్ తదితర గ్రామాల ముస్లిం, మైనారిటీలు వికారాబాద్‌లో జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వం ముస్లిం, ఇతర మైనారిటీలపై చిన్న చూపు చూస్తూ రాక్షసపాలన కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొహ్మద్ రఫీ, షఫీ, మన్సూర్ అలీఖాన్, గౌస్, తౌఫీక్, ఇబ్రహీం, హాజీ మన్సూర్, ఆసిఫ్ పాల్గొన్నారు.

శంషాబాద్: వక్ఫ్ బిల్లు రద్దు చేయాలంటూ ముస్లింలు శంషాబాద్‌లోని హైదరాబాద్-బెంగళూరు రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ బస్టాండ్, ఎయిర్‌పోర్టు చౌరస్తాల గుండా కొనసాగింది.

వికారాబాద్: కేంద్ర ప్రభుత్వం కావాలనే వక్ఫ్ సవరణ బిల్లును తెచ్చిందని ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ అన్నారు. వికారాబాద్‌లో ముస్లింలు ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ బిల్లును ప్రతీ భారతీయుడు వ్యతిరేకించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని కుట్ర చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ సర్ఫ్‌రాజ్, అయూబ్ అన్సారీ, ఆసిఫ్, వాయిద్ మియా, నాయకులు పాల్గొన్నారు.


శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన నాయకులు

ధారూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగసమందర్, అల్లాపూర్ గ్రామాల్లో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను శుక్రవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. గురువారం కురిసిన వడగండ్లకు ఈనిన పొలాలల్లో వడ్ల గింజలు రాలి నష్టం జరిగిందని రైతులు నాయకులకు వివరించారు. గింజ రాలిన వరి కంకులను వారు పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. వడగండ్లకు దెబ్బతిన్న పొలాలను అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజునాయక్, అసెంబ్లీ కో-ఆర్డినేటర్ నందు, బీజేపీ నాయకులు పాండుగౌడ్, వివేకనంద రెడ్డి, రాజేందర్‌గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న వరి పొలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్దతు ధర వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. శుక్రవారం బొంరాస్‌పేట్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. దళారులను ఆశ్రయించి రైతులు మోసపోకుండా మద్దతు ధర కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే సన్న వడ్లకు ప్రభుత్వం ఇచ్చే బోనస్ వస్తుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రైతులకు సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్‌లపై ఫిర్యాదు

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్‌యాదవ్‌పై కందుకూరు పోలీస్‌స్టేషన్‌లో బీజేవైఎం నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. బీజేవైఎం రాష్ట్రస్పోర్ట్స్ సెల్ కన్వీనర్ ఊటు మహేందర్, జిల్లాప్రధాన కార్యదర్శి బూర దిలీప్ ఆధ్వర్యంలో ఎస్సై సైదులుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలపై అసభ్యకర పదజాలంతో దయాకర్, అంజన్‌కుమార్ మాట్లాడారన్నారు. కార్యక్రమంలో సామల దయాకర్‌రెడ్డి, వరుణ్‌కుమార్, కె.శ్రీశైలం, అండేకార్ సాయి, మేరుగు మహేందర్, అభిలాష్ పాల్గొన్నారు.


ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం నాయకులు

నాసిరకం వస్త్రం

● గాలివానకు చిరిగిన జాతీయ జెండా ● నిర్లక్ష్యానికి నిదర్శనం

తాండూరు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, జాతీయ జెండా అంటే ప్రేమ, భక్తి లేక పోవడం వంటి కారణంతో ఆవిష్కరించిన కొన్నాళ్లకే నాణ్యత లేక పట్టణంలో నెలకొల్పిన పెద్ద జాతీయ జెండా చిరిగిపోయింది. గురువారం రాత్రి గాలులు, వర్షానికి 100 ఫీట్ల ఎత్తులో తాండూరులో ఏర్పాటు చేసిన ఆవిష్కరించిన జాతీయ జెండా చిరిగిపోయింది. గమనించిన అధికారులు రాత్రికి రాత్రే జెండాను తొలగించారు. కొన్ని నెలల క్రితం రూ.24లక్షలు వెచ్చించి ఇక్కడ భారీ జాతీయ జెండాను నెలకొల్పారు. ఒక్కో జెండా రూ.3 లక్షల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జెండాను సరఫరా చేసిన సమయంలో మున్సిపల్ అధికారులు నాణ్యతను పరిశీలించక నాసిరకం జెండాను ఎక్కించారని ఆరోపణలున్నాయి. ఇప్పటికే ఈ జాతీయ జెండాను రెండుసార్లు మార్చారు. కాంట్రాక్టర్‌కు యేడాది కాలం పాటు ఫ్రీ సర్వీస్ ఇవ్వాల్సి ఉంటుంది. మున్సిపల్ అధికారులు అదనంగా బిల్లు చెల్లిస్తారా? సర్వీసు తెప్పిస్తారా? వేచి చూడాలి.

కేంద్రాల కోసం రైతుల ఎదురు చూపులు

కులకచర్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు రైతులు ఎదురు చూస్తున్నారు. రైతులు పంట కోసి కల్లాల్లో ధాన్యం ఆరబెట్టి నిల్వ ఉంచారు. పొద్దంతా ఎండ, సాయంత్రం కాగానే మబ్బులు కమ్మి వర్షం కురుస్తోంది. దీంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. మండల పరిధిలో 60శాతం వరి కోతలు పూర్తయ్యాయి. గత్యంతరం లేక కొందరు వ్యాపారులకు క్వింటాలు రూ.2,100కే విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో క్వింటా రూ.2,300 ధర వస్తుంది.

పార్టీ సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే

తాండూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాయంలో గాంధీభవన్‌లో శుక్రవారం చేవేళ్ల లోక్‌సభా నియోజకవర్గ పార్టీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. సహచర ఎమ్మెల్యేలతో కలిసి సమావేశంలో పార్టీ నేతలు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి వీరికి దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టానికి నాయకులు పలుసూచనలు చేశారని ఎమ్మెల్యే తెలిపారు.


పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, పీసీసీ చీఫ్‌లతో పాటు పాల్గొన్న మనోహర్‌రెడ్డి

మృతిచెందిన లారీ డ్రైవర్ గుర్తింపు

● రంగారెడ్డి జిల్లాచెన్నంపల్లికి చెందిన రాజుగా నిర్ధారణ

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట-చిల్లకల్లు రహదారిలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఎస్ఆర్ఎంటీ ట్రాన్స్‌పోర్టు వాహనం గురువారం రాత్రి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో మృతిచెందిన డ్రైవర్‌ను రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చెన్నంపల్లికి చెందిన రాజు(43)గా పోలీసులు గుర్తించారు. రాజు 15ఏళ్లుగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరి మార్గమధ్యంలో జగ్గయ్యపేట కార్యాలయంలో పని చూసుకుని వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న కారు టైరు పంక్చరై డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా తిరగటంతో దాని వెనుకున్న ఆటోను రక్షించే క్రమంలో రాజు నడుపుతున్న లారీ పల్టీ కొట్టింది. ఆటోలో ఉన్న రూపస పుల్లయ్య, శివరాత్రి వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో విజయవాడ నుంచి జగ్గయ్యపేట వస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ క్షతగాత్రులను జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. వారికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలించారు.

యువజన కాంగ్రెస్ ధర్నా

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కడ్తాల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ నాయకురాలు సోనియాగాంధీ, ఎంపీ రాహుల్‌గాంధీలపై ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జిషీట్‌ను నిరసిస్తూ కడ్తాలలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. హైదరాబాద్-శ్రీశైలం రహదరిపై నిరసన అనంతరం ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మలను దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేస్తున్నందునే అక్రమ కేసులతో వేధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌బాబ, పట్టణాధ్యక్షుడు భానుకిరణ్, శ్రీకాంత్, పర్వతాలు, విజయ్, లింగం, మహేశ్, రామకృష్ణ, ప్రవీణ్‌గౌడ్, సందీప్, ఆకాశ్‌గౌడ్, శ్రీకాంత్, నరేశ్, లక్ష్మణ్, శ్రీను, శివ పాల్గొన్నారు.

'బీజేపీపై అసత్య ఆరోపణలొద్దు'

ఆమనగల్లు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై చార్జిషీట్ నమోదు కావడంతో నకిలీ గాంధీల బండారం బయటపడుతోందని ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. రాజకీయంగా కాంగ్రెస్ భూస్థాపితం అవుతుందనే దేశ వ్యాప్తంగా బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆమనగల్లులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా దక్కదని, బీజేపీ, ప్రధాని మోదీపై చేస్తున్న అసత్య ప్రచారాలను కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన కాంగ్రెస్ మనుగడ కోసమే పాకులాడుతోందని ఎద్దేవా చేశారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కొత్తూరులో నిర్మించనున్న భక్త హనుమాన్ రామలింగేశ్వర ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన పూజ శుక్రవారం వైభవంగా జరిగింది. వేద పండితులు రాజుశర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి హోమం నిర్వహించారు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అనేగౌని అంజయ్యగౌడ్, ఆర్ఆర్ పౌల్ట్రీ యజమాని రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో డీబీసీసీ డైరక్టర్లు ఆనంద్, డాక్టర్ శంకర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, సాధ మల్లారెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లుగుప్తా పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

చౌదరిగూడ,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్ధుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి, చౌదరిగూడ గ్రామాల్లో కార్మికులతో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, కృష్ణ, షబ్బీర్, చిన్నయ్య, నర్సమ్మ, యాదయ్య, జీపీ కార్మికులు వీరేశ్, పాపయ్య, జంగయ్య, చంద్రయ్య, లింగమయ్య పాల్గొన్నారు.

మోటరేసి దప్పిక తీర్చారు!

బషీరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కాశీంపూర్ ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కాలనీలో నీటిఎద్దడంటూ 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వార్త ప్రచురితమైంది. ఎంపీడీవో విజయ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు ఫోన్‌చేసి సమస్యపై తెలుసుకున్నారు. కాలనీలో నీటి సమస్య నెలకొందని, మూడు నెలల కింద బోరు వేసినా నిధుల్లేక కొత్త మోటార్ బిగించలేదని చెప్పారు. దీంతో పాత మోటార్‌ను బాగుచేయించాలని ఎంపీడీవో ఆదేశించారు. నిధులు లేకున్నా కార్యదర్శి సొంత డబ్బుతో సింగిల్ ఫేజ్ మోటర్‌ను బాగు చేయించి బోరులో దించారు. కాలనీ వాసుల నీటి సమస్య తీరింది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఐడియా అదుర్స్!

జనరేటర్‌తో సెల్‌ఫోన్ చార్జింగ్



సెల్‌ఫోన్లు చార్జింగ్ పెట్టుకుంటున్న కాలనీవాసులు

పెద్దేముల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఐడియా అదిరిపోయింది. కరెంటు లేదని చింతించకుండా కొత్తగా ఆలోచించి సెల్‌ఫోన్ల చార్జింగ్‌తో పాటు మోటారు నుంచి తాగునీరును సైతం పట్టేసుకున్నారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో గురువారం నాటి గాలివాన దుమారానికి తట్టెపల్లి సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 11కేవీ లైన్‌లో మూడు స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో తట్టెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు కరెంటు సరఫరా ఆగిపోయింది. కనీసం సెల్‌ఫోన్‌లో సైతం చార్జింగ్ పెట్టుకోలేని దుస్థితి. అయితే తట్టెపల్లి గ్రామంలో సుమారు 24 గంటలుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఒక కాలనీలోని యువకులు కొత్తగా ఆలోచించారు. వీటన్నింటికి ఒకటే పరిష్కారమని జనరేటర్‌ను తీసుకొచ్చి కాలనీలోని బోరుకు కనెక్షన్ ఇచ్చి తాగునీరు పట్టుకున్నారు. అలాగే మరో కనెక్షన్ కొన్ని బోర్డులకు ఇచ్చి వాటి ద్వారా ఒకేసారి సుమారు 20 ఫోన్ల వరకు చార్జింగ్ పెట్టుకున్నారు. అలా విడతల వారీగా ఫోన్ చార్జింగ్ చేసుకుని అటు తాగునీటి సమస్య, ఇటు చార్జింగ్ సమస్యను పరిష్కరించుకున్నారు.

ఆవిష్కరణలపై ఇక్ఫాయ్, బిట్స్ ఒప్పందం

శంకర్‌పల్లి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతల ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధి పెంపునకు ఇక్ఫాయ్ వర్సిటీ, బిట్స్ పిలానీలు అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. శంకర్‌పల్లి మండలంలో గల ఇక్ఫాయ్ కళాశాలలో శుక్రవారం అవగాహన ఒప్పందంపై బిట్స్ పిలానీ గ్రూప్ వైస్‌చాన్స్‌లర్ వి.రామ్‌గోపాల్‌రావు, ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వీసీ ఎల్ఎస్. గణేశ్‌లు సంతకం చేశారు. జాతీయ భద్రతాంశాల్లో పరిశోధన/ఆవిష్కరణలు, విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిలో పరస్పరం సహకరించుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ.. జాతీయ భద్రతలో ఆధునిక సాంకేతికాంశాలపై ఉమ్మడి పరిశోధన, ఆవిష్కరణలు, కన్సల్టెన్సీ అసైన్మెంట్లు, స్టార్టప్ కో-ఇంక్యుబేషన్ తదితరాలపై కృషిచేస్తామన్నారు. డీఆర్డీవో మాజీ చైర్‌పర్సన్ జి.సతీష్‌రెడ్డి ఈ ఒప్పందంపై అభినందించారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ అధిపతి రామమనోహర్‌బాబు, బిట్స్ హైదరాబాద్ డైరెక్టర్ సామ్మో, ప్రొఫెసర్లు అమృత, సంకత్ గోయెల్, విజయలక్ష్మి, శైలజన్, సాయినాథ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల పల్లెబాట

మండుటెండల్లో ప్రజాప్రతినిధులకు 'పరీక్ష'

- జూన్ 2 వరకు గ్రామాల్లో తిరగాలని సీఎం ఆదేశం
- పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని దిశానిర్దేశం
- 'స్థానికం'లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఉద్బోధ



తాండూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): "ఎన్నికల ముందు తిరిగినట్టే ఇప్పుడూ పర్యటించాలి. ప్రజల్లో తిరుగాలి. ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితం కావొద్దు. సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకొని పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. జూన్ 2వ తేదీ వరకు నిరంతరం పల్లెల్లో తిరగండి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి." అని ఇటీవల నిర్వహించిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ(సీఎల్పీ) సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి తోటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. సీఎం ఆదేశాలతో ఎమ్మెల్యేలు ఇక పల్లెబాట పట్టనున్నారు. 46రోజులూ పల్లెల్లో తిరగాలని ప్రభుత్వాధినేత ఎమ్మెల్యేలను ఆదేశించారు. ఏప్రిల్ 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటనకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. దీంతో ఎమ్మెల్యేలు పల్లెబాటకు కసరత్తు ఇప్పటికే కొందరు ఏదో కార్యక్రమం పేరిట గ్రామాల్లో తిరుగుతున్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్ నుంచి, సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలసిందే. ఇక తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు సీఎం ఆదేశాలతో నియోజకవర్గాలల్లో 'పల్లెబాట' పడుతున్నారు.

ప్రభుత్వ పనులపై ప్రచారం

ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రచార సభల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ వాటిల్లో నెరవేర్చిన, తీరుస్తున్న హామీలను ప్రజలకు వివరిస్తారు. ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, వర్తింపజేస్తున్న పథకాలపై ప్రచారం చేస్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే సిలిండర్, 200యూనిటర్ల వరకు ఉచిత కరెంటు, కొత్తగా తెచ్చిన 'రాజీవ్ యువ వికాసం', రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ, 'భూ భారతి' పోర్టల్, రైతుబంధు, రుణామాఫీ, కొత్త రేషన్‌కార్డుల జారీ వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తెసుకెళ్లి పార్టీకి మైలేజీ తేవాలని సీఎం, పీసీసీ చీఫ్ సూచించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ చేపట్టిన కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ అమలు, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలను హైకమాండ్ ఆదేశించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చూపుతున్న మొండిచెయ్యి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు విడుదల చేయకపోవడం, రాష్ట్రానికి కేంద్ర సహాయ నిరాకరణ తదితరాంశాలపై ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తప్పుడు ప్రచారాన్ని ప్రజల్లోనే తిప్పికొట్టేలా ఎమ్మెల్యేలు స్థానిక నాయకత్వంతో కలిసి ప్రజల్లో అవగాహన కల్పించి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసేలా ఇప్పటి నుంచే సన్నద్ధమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలిసి పర్యటిస్తారా?

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీగా ఉన్న ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి తాండూరు గతంలో తాండూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. తాండూరు ప్రాంతంపై పట్టున్న ఈయన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి పర్యటిస్తారా? అన్న సందేహం శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అయితే మే 1 నుంచి జూన్ 2వ తేదీ వరకు నియోజకవర్గాలలో తానూ పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. ఇప్పటి వరకు సీఎం హోదాలో తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లో రెవంత్‌రెడ్డి పర్యటించలేదు. అయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఆయన హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ నియోజకవర్గాల్లో పర్యటిస్తారని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

కరెంటు కట్‌తో కష్టాలు

- 24గంటలపాటు పవర్ బంద్
- తాండూరువాసుల అవస్థలు

తాండూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): 'తాండూరు ప్రాంతంలో గంటలకొద్దీ కరెంటు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు విద్యుత్ లేక ఇక్కట్లకు గురయ్యారు. గురువారం రాత్రి ఈదురు గాలుల, వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోక పాత తాండూరు వాసులు, పెద్దేముల్ లైన్‌లోని కందనెల్లితండా, గాజీపూర్, గోట్లపల్లి, బుద్ధారం గ్రామాలకు 24గంటలు కరెంటు సరఫరా నిలిచింది. తాగునీటికి, పంటల నీటిపారకానికి ఇక్కట్లు పడ్డారు. గురువారం సాయంత్రం 4గంటలకు తాండూరులో విద్యుత్ సరఫరా నిలిచింది. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత కొన్ని ప్రాంతాల్లో కరెంటొచ్చింది. పాత తాండూరు ఫీడర్‌లో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అధికారులకు ఫోన్‌లు చేస్తే స్విచాఫ్ వచ్చాయని పాత తాండూరు వాసులు వాపోయారు. వాట్సాప్ గ్రూప్‌లో మెస్సేజ్‌లు పెట్టి కరెంటు సరఫరా పునరుద్ధరించాలని కోరారు. అదే రాత్రి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌కమింగే లేదని, ఫీడర్ ట్రిప్ అవుతోందని అధికారులు చెప్పారు. గంటల తరబడి విద్యుత్ లేకుంటే ఏం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఫీడర్ ట్రిప్ అయినా, ఫ్యూజ్ పోయినా స్వల్పకాలంలో తీర్చగలిగే సమస్యేనని, మరి గంటలకొద్దీ సరఫరా ఎందకు నిలిచిందని ట్రాన్స్‌కోసిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. మున్ముందు ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



తాండూరు మండలం అంతారంలో తండాలో..

గాలివాన బీభత్సం

(ఐదో పేజీ తరువాయి)

పరామర్శించారు. వికారాబాద్ సదాశివపేట ప్రధాన రహదారి కావడంతో అరగంట పాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కొత్తపల్లి, కొత్తపల్లి తండా తదితర గ్రామాలలో ఈదురు గాలులకు పశువుల దొడ్లు నేలకూలాయి. రేకులు లేచిపోయి దూరంగా పడిపోయాయి. గాలులకు వరిపంట నేలవాలింది. రోడ్డుకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలు ఇండ్లపై వేప చెట్లు కూలడంతో ఇంటి యజమానులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. కొత్తపల్లి, మాల్ గ్రామాల మధ్యన రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలడంతో రైతులు ఇండ్లకు చేరుకోవడానికి తంటాలు పడ్డారు. ఈదురు గాలుల కారణంగా వరి పంటలకు స్వల్పంగా నష్టం జరిగిందని రైతులు చెప్పారు. తాండూరులో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మొయినాబాద్ మండలంలో రెండు గంటల పాటు భారీగా కురిసిన వర్షానికి కరెంట్ సరఫరా నిలిచి పోయింది. కేతిరెడ్డిపల్లిలో చెట్లు విరిగిపడ్డాయి. ఇబ్రహీంపట్నంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం చోటుచేసుకుంది. రోడ్లపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వివిధబస్తీల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.



మర్పల్లిలో ఈదురు గాలులకు నేల కొరిగిన అరటి తోట

వర్షపాతం నమోదు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ ఆదర్శనగర్‌లో 43.8 మిల్లీమీటర్లు, బాలానగర్‌లో 39.3 మిల్లీమీటర్లు, ఉప్పల్‌లోని మునరాబాగ్‌లో 18.0 మిల్లీమీటర్లు, కూకట్‌పల్లిలో 16.3 మిల్లీమీటర్లు, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ శివరాంపల్లిలో 38.5 మిల్లీమీటర్లు, అత్తాపూర్‌లో 29.5 మిల్లీమీటర్లు, సరూర్‌నగర్ ఎన్జీఐ కాలనీలో 29.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బాలాపూర్ మండలం ఏవియేషన్ అకాడమీ, నాదర్‌గూల్ ప్రాంతంలో 26.3 మిల్లీమీటర్లు, శంషాబాద్ మండలం వినయ్‌నగర్‌లో 25.5 మిల్లీమీటర్లు, కొత్తూరులో 22.5 మిల్లీమీటర్లు, ఇబ్రహీంపట్నంలో 21.0 మిల్లీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్‌లో 20.8 మిల్లీమీటర్లు, శేరిలింగంపల్లిలో 19.3 మిల్లీమీటర్లు, ఇబ్రహీంపట్నం మండలం మంగళ్‌పల్లిలో 19.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

రజతోత్సవ సభకు భారీగా జనసమీకరణ

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తితో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి భారీగా జనసమీకరణ చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధి శేరిగూడలో గల సీకే కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి వెయ్యి బస్సులు, రెండు వేల కార్లలో కార్యకర్తలు, అభిమానులు, రైతులు, మహిళలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచే 7వేల మందిని సమీకరిస్తున్నామని, వంద బస్సులు, ఇతర వాహనాలను ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే వారందరికీ తాగునీరు, మజ్జిగ, భోజన వసతి కల్పిస్తామన్నారు. ఆ రోజు ఊరూరా జెండా విష్కరణ చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమొచ్చిన ఏడాదిన్నర తర్వాత బీఆర్ఎస్ నిర్వహిస్తున్న బహిరంగ ఇదని, పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగం కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కేసీఆర్ ప్రజలకు వివరిస్తారని చెప్పారు. రేవంత్ సర్కార్ విధానాలతో ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. హామీలను తుంగలో తొక్కారన్నారు. రైతు రుణమాఫీ,రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా ఒక్కటి కాదు.. ఇచ్చిన ఏ హామీని పూర్తిగా నెరవేర్చలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధే కంటికి కన్పిస్తోందని, కాంగ్రెస్‌తో ఒనగూరిందేమీ లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

'రంగారెడ్డీ రాజీనామా చెయ్!'

మంత్రి పదవి రాకుంటే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన మల్‌రెడ్డి రంగారెడ్డి దమ్ముంటే వెంటనే రాజీనామా చేయాలని కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. మంత్రి పదవొస్తే ఏదో చేస్తానని కాలం ఎల్లదీస్తూ మల్‌రెడ్డి నియోజకవర్గానికి ఏడాదిన్నరగా ఏమీ చేయడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన రూ.470కోట్ల పనుల ప్రొసీడింగులను కూడా పట్టించుకోలేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, వి.లక్ష్మారెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, డి.రాంరెడ్డి, ఎ.యాదగిరి, జక్క రాంరెడ్డి, చంద్రయ్య, కృపేశ్, రమేష్‌గౌడ్, బుగ్గ రాములు, రమేష్, కిషన్‌గౌడ్, ఎ.వెంకట్‌రెడ్డి భరత్‌రెడ్డి, జె.రాజు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ స్థలంపై వివాదం

రాత్రికి రాత్రే బోర్డు తొలగింపు.. గేటుకు తాళం వేసిన ప్రైవేట్ వ్యక్తి

నర్సరీని కాపాడాలని స్థానికుల డిమాండ్

ఘట్‌కేసర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల క్రితం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన నర్సరీ స్థలం వివాదాస్పదంగా మారింది. మున్సిపల్ పదో వార్డు సర్వేనెంబర్ 127లోని ప్రైమ్‌ల్యాండ్ వెంచర్‌లో గల పార్కుస్థలంలో 2020 సెప్టెంబరు 26న 9,560చదరపు గజాల విస్తీర్ణంలో నర్సరీని ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి నర్సరీ బోర్డుపై పేరు తొలగించి.. 'ఈ స్థలం కందకంట్ల మాధవరెడ్డిది.' అని ఫోన్‌నెంబర్ రాశారు. అధికారులు, కౌన్సిల్ నర్సరీని ఏర్పాటు చేశారు. మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. శిలాఫలకాన్ని గతంలోనే ఎవరో మాయం చేశారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. తాజాగా నర్సరీ బోర్డుపై నలుపు పూసి ప్రైవేట్ వ్యక్తి పేరు రాసుకున్నారు. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారని పశ్నిస్తున్నారు. ప్రైవేట్ స్థలమైతే సదరు అక్కడ నర్సరీని ఎలా ఏర్పాటు చేశారని, సదరు వ్యక్తి అప్పట్లోనే ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ జరిపి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.



నర్సరీ ఆర్చిపై రాతలను చెరిపేశారిలా...

ఈ స్థలం నాదే

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 127లో 9,560 చదరపు స్థలాన్ని నేను 2019లో కొన్నా. నా స్థలంలో ఏర్పాటు చేసిన నర్సరీని తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఏడీ సర్వే రిపోర్టు ఆధారంగా నా స్థలాన్ని స్వాధీనం చేసుకున్నా. కోర్టుకు వెళ్లినా స్థలం నాకే వస్తుంది.

- కందకట్ల మాధవరెడ్డి, ఘట్‌కేసర్

మున్సిపాలిటీ స్థలాన్ని కాపాడాలి



ఘట్‌కేసర్‌లోని ప్రైమ్‌ల్యాండ్ వెంచర్‌లో గల పార్కు స్థంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ బోర్డుపై ప్రైవేట్ వ్యక్తి పేరు రాసుకోవడం సరి కాదు. ఏదైనా ఉంటే కోర్టులో చూసుకోవాలి. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేయాలి. కోట్ల రూపాయాల విలువైన పార్కు స్థలాన్ని కాపాడేందకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రాధాకృష్ణ, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం



కొండాపూర్‌రోడ్డులో గల నర్సరీ బోర్డుపై రాసిన రాతలపై చర్యలు తీసుకుంటాం. ఆ స్థలం మున్సిపాలిటీదే. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే కోర్టుకు వెళ్లాలి. కానీ రాత్రికిరాత్రే బోర్డులు చెరిపేయడం సరికాదు. నర్సరీలో మొక్కలు పెంచుతున్నాం. వాటికి రోజు నీరుపోయాలి. ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్, ఘట్‌కేసర్



కురుమ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

కురుమ సంఘం భవన నిర్మాణం అభినందనీయం

చేవెళ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులసంఘాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దేవుని ఎర్రవల్లిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కురుమ సంఘం భవనాన్ని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, సీనియర్ నాయకుడు క్యామ మల్లేశంతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఆర్‌సీ పురం మాజీ కార్పొరేటర్ పుష్పనాగేశ్, మాజీ సర్పంచ్‌లు అంజయ్య, శ్యామలయ్య, సామ మాణిక్యరెడ్డి, కురుమ సంఘం మండల అధ్యక్షుడు కచిరె వెంకటేశం, దేవుని ఎర్రవల్లి కురుమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ ఉన్నారు.

ఆత్మరక్షణకు కరాటే..

షాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని తెలంగాణ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. శుక్రవారం షాబాద్‌లో కైట్ కళాశాలలో మొగిలిగిద్ద ఏజేపీ(మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల) పాఠశాలలో కరాటే బోల్ట్ గ్రేడింగ్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శివరంజని, పీఈటీలు నాగజ్యోతి, అరుణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్తులు చేస్తున్న దీక్షలు శుక్రవారం 164వ రోజుకు చేరాయి. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిరసన ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసే 11 కొత్త మండలాల్లో గట్టిప్పలపల్లిని చేర్చాలని డిమాండ్ చేశారు.

విభజనతోనే సరి.. వసతులేవీ?

(5వ పేజీ తరువాయి)

కడ్తాల మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో కలిపారు. అంతకుముందు మూడు మండలాల ప్రజలకు కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఆయా కార్యాలయాలు అందుబాటులో ఉండేవి. దీంతో ఇటు దూర, వ్యయ భారం ఉండేది కాదు. విభజన సమయంలో నాలుగు మండలాలకు కలిపి ఆయా కార్యాలయాలను ఆమనగల్లులో ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. ఆమనగల్లు పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్, సబ్‌ట్రెజరి, ఆర్టీఏ, ఆర్డీఓ,ఏసిపి ,ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఆర్‌అండ్‌బీ డీఈ, ఐబి డీఈ కార్యాలయాల ఏర్పాటు వల్ల నాలుగు మండలాల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని విన్నవించారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోయింది.

వేర్వేరు ప్రాంతాల్లో కార్యాలయాలు

జిల్లాల విభజన అనంతరం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలను కందుకూరు ఆర్డీవో పరిధిలో చేర్చారు. మాడ్గుల మండలాన్ని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కిందికి మార్చారు. కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలకు సబ్‌ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, కార్యాలయాలు మహేశ్వరంలో, ఆర్టీఏ, ఏసీపీ కార్యాలయాలు షాద్‌నగర్‌లో కొనసాగుతున్నాయి. మిగతా కార్యాలయాలు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలలో ఉన్నాయి. మాడ్గుల మండలం ప్రజలకు సైతం ఒక్కొక్క కార్యాలయాలు ఒక్కోచోట ఉన్నాయి. దీంతో ప్రజలు పనుల కోసం ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆయా కార్యాలయాల ఏర్పాటు గురించి మండల ప్రజాప్రతినిధులు పలుమార్లు ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి సైతం తీసుకుపోయినా ఫలితం కనిపించలేదు. కల్వకుర్తి నియోజకవర్గం రెండు మండలాలు నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో, నాలుగు మండలాలు రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉండడంతో పాలనాపరంగా కూడ అనేక సమస్యలు తలెత్తున్నాయి. డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఇతర పార్టీలు అనేకసార్లు ఆందోళనలు చేపట్టాయి. అయినా నేటికీ స్పందన లేదు. కొత్తగా ఏర్పాటైన కడ్తాల మండల కేంద్రంలో కూడా తగిన వసతులు నేటికి కల్పించలేదు. దీంతో మండలంగా ఏర్పడినా ఇంకా ఇక్కడ గ్రామ వాతావరణాన్నే తలపిస్తుంది. ఇక్కడ నెలకొల్పిన కార్యాలయాలకు కూడా సొంత భవనాలు లేక ఇటు ప్రజలు, అటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి నాలుగు మండలాల ప్రజలకు సౌకర్యవంతంగా ఆమనగల్లు పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్, సబ్‌ట్రెజరీ, ఆర్టీఏ, ఆర్డీవో, ఏసీపీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఆర్‌అండ్‌బీ డీఈ, ఐబీ డీఈ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తొమ్మిదేళ్లుగా ఇబ్బందులు



డివిజన్ కార్యాలయాల ఏర్పాటు కోసం తొమ్మిదేళ్లుగా ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నా స్పందన లేదు. పాలక ప్రజాప్రతినిధులు ఎవరూ ఈ విషయంలో చొరవ చూపడం లేదు. పాలనా సౌలభ్యం కోసం ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల ను రంగారెడ్డి జిల్లాలో విలీనం చేసిన అప్పటి ప్రభుత్వం అందుకనుగుణంగా వసతులు కల్పించడంలో విఫలమైంది. పునర్విభజనతో ఉన్న వసతులు, సౌకర్యాలు దూరమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

\- కర్నాటి విక్రమ్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, ఆమనగల్లు

విపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయ్..



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆనందంగా ఉంటే విపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం తలకొండపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కల్వకుర్తి నియోజకవర్గం గణనీయమైన అభివృద్ధి సాధించిందని, రూ.500 కోట్లతో రోడ్ల అభివృద్ధి, మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, మార్కెట్ డైరెక్టర్లు అంజయ్య, శ్రీశైలం, నరేశ్ నాయక్, అజీం, రవీందర్, పాండు రంగయ్య, శ్యామ్‌సుందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో భవనం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎంపీడీవో భవన నిర్మాణ పనుల పరిశీలన

నందిగామ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీవో భవన నిర్మాణ పనులను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం పరిశీలించారు. త్వరలో భవన నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు జిల్లెల్ల రాంరెడ్డి, జంగ నర్సింహులు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, పిట్టల రాములు, కృష్ణ, జంగయ్యగౌడ్, కృష్ణ, అంజుయాదవ్, రామస్వామి, రమేష్, రాములు, శ్రీశైలం, బొమ్మగల్ల నర్సింలు, మహేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

తలకొండపల్లి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని నాయకులు జ్యోతయ్య, నర్సింహారెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రోమోర్ విత్తన, ఎరువుల దుకాణాన్ని ప్రారంభించారు. నకిలీ విత్తనాలు, ఎరువులకు ఆస్కారం లేకుండా రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు.

బీఆర్‌ఎస్ సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు ఉప్పెనలా కదిలి వచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసం కోల్పోయిందని అందుకే ఆ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుకు రావడంలేదని ఆరోపించారు. తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ 16 నెలల పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప ప్రగతి ఏమి లేదన్నారు. ఆరు గ్యారంటీలలో అర గ్యారంటీ కూడా అమలుకు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు వెంకటయ్య, రమేశ్, లింగంగౌడ్, కుమార్‌గౌడ్, శ్రీశైలం యాదవ్, శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలతో తస్మాత్ జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న మహేశ్వరం అగ్నిమాపక సిబ్బంది

మహేశ్వరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై అప్రమత్తతో ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి నాగార్జున అన్నారు. జాతీయ అగ్నిమాపక సేవా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహేశ్వరంలోని ఓ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మహేశ్వరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి సమాచారం

'భూ భారతి'పై అవగాహన

శంకర్‌పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) భూ భారతి చట్టంపై శంకర్‌పల్లి మండల కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం ఉంటుందని శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు మండల పరిధిలోని బద్దం మాణిక్యరెడ్డి గార్డెన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ నారాయణారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య హాజరవుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చేవెళ్ల: భూ భారతి చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. చేవెళ్ల మున్సిపాల్ పరిధిలోని మల్కాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న పద్మావతి కన్వెన్షన్ హాలులో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ నారాయణరెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య హాజరవుతారని పేర్కొన్నారు.

చందన్‌వెళ్లిలో రక్తదాన శిబిరం

షాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధిగ్రస్తులకు శనివారం మండల పరిధిలోని చందన్‌వెళ్లిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి శుక్రవారం తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ చందానగర్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని, రక్తదానం చేయాలనుకునేవారు చందన్‌వెళ్లికి రావాలని కోరారు.

కొత్తూర్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం

కొత్తూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బాలాజీ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యాదేవేందర్‌యాదవ్ అధ్యక్షతన 10 గంటలకు బడ్జెట్ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే సాధారణ సమావేశం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి బానోతు హాము తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అజీజ్‌నగర్ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనిధి ఫీడర్(నాగిరెడ్డిగూడ) పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ రెండు ఫీడర్ల పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను సిబ్బంది తొలగిస్తున్నారని, అందుకే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హైదరాబాద్-శ్రీశైలం రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించాలి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆచారి, హరిప్రసాద్

ఆమనగల్లు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఆమగనల్లు మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. జాతీయ రహదారిపై వాహనాల సంఖ్య పెరిగిపోయిందని, రోడ్డు ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. హైదరాద్-శ్రీశైలం రహదారి నాలుగు లేన్లుగా విస్తరణకు డీపీఆర్ సిద్ధం చేశామని, త్వరలో టెండర్ ప్రక్రియ చేపడతామని కిషన్‌రెడ్డి తెలిపినట్లు ఆచారి చెప్పారు.

కాంగ్రెస్ నేతలపై దాడి అమానుషం

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులపై దాడి చేయడం అమానుషమని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు గొరైంకల యాదయ్యపై దాడి చేయడంతో శుక్రవారం అన్నోజిగూడలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అడిగినందుకు యాదయ్యపై దాడి చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌డీ అజీజ్, సత్యనారాయణరెడ్డి, జగదీశ్, మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు దోహదపడుతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని టంగటూర్ గ్రామంలో కాంగ్రెస్ నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ అధ్యక్షుడిగా రేసు పాండురంగారెడ్డి, కార్యదర్శిగా రామ్‌కృష్ణతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి రవీందర్‌రెడ్డి, నాయకులు బద్దం కృష్ణారెడ్డి, మహిపాల్‌రెడ్డి, యాదిరెడ్డి, పాండురంగారెడ్డి, అంతయ్య, రాజిరెడ్డి, మల్లేశం, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

కోట మైసమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

తలకొండపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెదక్‌పల్లి గ్రామంలో కోట మైసమ్మ ఆలయ పునర్ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కసిరెడ్డి యాదిరెడ్డి ముందుకు వచ్చారు. గ్రామ నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి యాదిరెడ్డిని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో కసిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కసిరెడ్డి విజయేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అల్వాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విజయేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నరేశ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



షాబాద్: మరియాపురంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



శంషాబాద్: వెలంకినికాలనీలో గుడ్‌ఫ్రైడే ఉత్సవాల్లో శిలువ మోస్తున్న కళాకారుడు

జిల్లా వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. సర్వ మానవాళి రక్షణ కోసం ప్రభువైన ఏసుక్రీస్తు తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహనీయుడని కీర్తించారు. చేతిలో ఏసు సిల్వలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఏసు కీర్తనలు పాడుతూ ముందుకు సాగారు. జీసస్ చూపిన ప్రేమ, కరుణ, క్షమ, త్యాగ మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పాస్టర్లు సూచించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఏసు ప్రభును స్మరించుకున్నారు.

\- కేశంపేట/షాబాద్/చౌదరిగూడ/శంషాబాద్/కొత్తూర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):

పాఠశాల అభ్యున్నతికి కృషి

మంచాల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి సహకారం అందిస్తానని మంచాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం మాజీ చైర్మన్ సికిందర్‌రెడ్డి అన్నారు. ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం రూ.1.20 లక్షల సొంత ఖర్చులతో రెండు బోర్లు వేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చీరాల రమేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ నూకం రాజు, జానీపాషా, గుడ్డిమల్ల చంద్రయ్య, బుచ్చిరాములు, మార బుగ్గరాములు, జంగయ్య, పున్నం రాము, మార సురేష్, చెరుకు నర్సింహ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

యాచారం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో కలిసి చదువుకున్న విద్యార్థిని కుటుంబానికి తోటి విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. శుక్రవారం యాచారం మండలంలోని మేడిపల్లి ఉన్నత పాఠశాలలో 2008-09 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన మాధవి ఈనెల 1న మృతి చెందింది. విషయం తెలుసుకున్న అప్పటి తోటి విద్యార్థులు మాధవి కుటుంబ సభ్యులకు రూ.50 వేలు అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో బన్నె శ్రీ శైలం, ముంతలింగం, కరుణాకర్, శేఖర్, పాండు, రవిచందర్, వెంకటేష్ తదితరులున్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తప్పక వేయించాలని రాచులూరు పశువైద్యాధికారి డాక్టర్ షాహీన్‌షేక్ సూచించారు. శుక్రవారం మండలంలోని మీర్కాన్‌పేట గ్రామంలో పాడి పశువులకు టీకాలు వేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగు నెలలు దాటిన దూడెలకు కూడా టీకాలు వేయించాలన్నారు. శుక్రవారం 12మంది రైతులకు చెందిన 100 పాడి పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నాగునాయక్, శివకుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆకులమైలారం మాజీ ఉపసర్పంచ్ శంకరి తిరుపతయ్య అన్నారు. ఆ గ్రామానికి చెందిన మంత్రి సత్తయ్య, జి.శివలకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను శుక్రవారం అందజేశారు కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బి.బీరప్ప, టి.మహేందర్, బీఆర్‌ఎస్ నాయకులు అంజయ్య, మల్లేష్, ఎం.మహేష్, వి.కృష్ణ, కె.శ్రీకాంత్ తదితరులున్నారు.



ఆమనగల్లు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం లక్ష్మీ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. గురువులు అనంతరెడ్డి, బాలబ్రహ్మం, ఎలిజబెత్, శోభరాణి, శ్యామలాదేవి, బుచమ్మ, పద్మలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

కంఠ మహేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం

మాడ్గుల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్కపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వర స్వామి ఆలయంలో టైల్స్ గ్రానైట్స్ వేయిస్తానని అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముకురోజు కృష్ణమాచారి గౌడ కులస్తులకు హామీ ఇచ్చారు. దీనికోసం దాదాపు రూ3.50 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేసి ఆలయ కమిటీ గౌడ కులస్తులకు నగదు అందచేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో దండు శేఖర్‌గౌడ్, కృష్ణగౌడ్, దండు వెంకటయ్యగౌడ్, రాములుగౌడ్, తిరుపతయ్యగౌడ్, దశరథం గౌడ్, కాశమయ్య గౌడ్, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి..

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఫరూక్‌నగర్ మండలం వెంకన్నగూడలో నూతనంగా నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి బీజేపీ షాద్‌నగర్ ఇన్‌చార్జి అందె బాబయ్య విరాళం అందించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. తండావాసుల కోరిక మేరకు రూ.25 వేల నగదు అందించారు. అనంతరం ఆయనను తండావాసులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రశాంత్, వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

కడ్తాల సీఐకి సన్మానం

కడ్తాల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కడ్తాల సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌ను శుక్రవారం యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి మహాత్మజ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే చిత్రపటాలను అందించారు. నాయకులు కుమార్‌గౌడ్, సిద్దిగారి మహేశ్,కృష్ణ, సీతారామ్, కుమార్, క్రాంతికుమార్ ఉన్నారు.

మురుగు.. వాగులో పరుగు!

(5వ పేజీ తరువాయి)

మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. ఆదిభట్ల, బొంగ్లూర్, ఎంపీపటేల్‌గూడ, మంగల్‌పల్లి వార్డులలో కొత్త కాలనీలతోపాటు అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. కొత్త కాలనీలు, అపార్ట్‌మెంట్ నిర్మాణాలు జరుగుతున్న క్రమంలో సదురు అపార్ట్‌మెంట్ యాజమాన్యాలు నిబంధనల ప్రకారం డ్రైనేజీ వాటర్ కోసం ఎస్టీపీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న మెజార్టీ అపార్ట్‌మెంట్స్‌లలో వీటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో డ్రైనేజీ వాటర్‌ను రోడ్ల మీదకు, లేదా సమీపంలోని వాగుల్లోకి వదులుతున్నారు.

మురుగు కుంటలా దర్శనం

ఆదిభట్ల మున్సిపాలిటీలోని ఫులందరి వాగులో డ్రెయినేజీ నీరు చేరి కంపుకొడుతోంది. వరద నీరు ప్రవహించాల్సిన వాగులో మురుగు పరుగులు పెడుతుంది. ఎంపీపటేల్‌గూడ, బొంగ్లూర్ మధ్యలో ఉన్న మైహోమ్స్ సీఎంఆర్, అంతపురం, గంగానగర్, మంగల్‌పల్లి సమీపంలోని పలు కాలనీల నుంచి వెలువడుతున్న మురుగునీరు ఫులందరి వాగులో వచ్చి చేరుతుంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధ భరితంగా మారింది. మహమ్మాయి దేవాలయ సమీపంలోని చెక్‌డ్యామ్‌లో ఉన్న వరదనీటిలో మురుగునీరు చేరడంతో అంజనేయస్వామి విగ్రహం మురుగులో మునిగిపోయింది. దీంతో స్థానికులు చెక్‌డ్యాంమ్‌కు గండికొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ఎంపీపటేల్‌గూడ కల్వర్టు దగ్గర డ్రైనేజీ వాటర్ నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ ప్రాంతం నుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నారు.



సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం ఇస్తున్న ఎంపీపటేల్‌గూడ వాసులు

రోగాల బారిన జనాలు

ఫులందరి వాగులో మురుగు చేరుతుండటంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. మరోవైపు పందులు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. నెల రోజుల వ్యవధిలో ఈ ప్రాంతానికి చెందిన సుమారు 80 మందికి పైగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ బారిన పడ్డారని ప్రజలు చెబుతున్నారు. రాత్రి సమయంలో బయట ఉండలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. మురుగునీటిని ఫులందరి వాగులో కలపొద్దని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.